క్లుప్తంగా

నేడు విద్యుత్ ఫిర్యాదుల స్వీకరణ

యానాం: యానాం ప్రాంత విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి గాను ఈ నెల 11వ తేదీ గురువారం ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ లంక కృష్ణారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌శాఖ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకూ పుదుచ్చేరి విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు సింథిల్‌కుమార్ పర్యవేక్షణలో ఫిర్యాదుల స్వీకరణ జరుగుతుందన్నారు.

వెంకన్న వాహనోత్సవం



వెంకన్న వాహనోత్సవంలో చిన్నారుల కోలాటం

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంకలో ఉన్న పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి వారి తీర్థ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి మహిళా భక్తులచే పురవీధుల్లో వాహనోత్సవం బుధవారం నిర్వహించారు. స్థానిక విత్తనాలవారిపాలెం దాస సాహిత్య ప్రాజెక్ట్ చిన్నారులు ప్రదర్శించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. శ్రీనివాస మహిళా అన్నదాన సేవా సంఘం, నగర్ యూత్, శ్రీనివాస బాలమిత్ర సంఘ ప్రతినిధులు చింతపట్ల బాబు, అంకం పెద రాజు, బిళ్ల మల్లేశ్వరరావు, కాసిన ప్రసాద్, లక్కింశెట్టి పవన్, కాశిన నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు



విలసవిల్లి రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న పురోహితుడు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామ పరిధిలోని భూపయ్య అగ్రహారం రామాలయం 10వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో పురోహితులు ముస్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామచంద్రుల విగ్రహాలకు అభిషేకాలు చేసి, తులసి పూజ జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఈ - మోసాలతో జాగ్రత్త

అమలాపురం టౌన్: వ్యాపారులకు ఫోన్లు చేసి తాము కార్మిక శాఖ అధికారులమని చెప్పుకుని డబ్బులు గుంజే ప్రయత్నం చేస్తున్న సైబర్ నేరగాళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అమలాపురం సహాయ కార్మిక అధికారి పీఎస్ మహేష్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. అమలాపురం పట్టణం, పరిసర ప్రాంతాల్లో సైబర్ నేరగాళ్లు కొందరు వ్యాపారులకు ఫోన్లు చేసి లైసెన్స్ రెన్యువల్, అపరాధ రుసుము అంటూ వ్యాపార నిబంధనలు గురించి చెబుతూ గుగూల్ పే లేదా ఫోన్ పే చేయాలని డబ్బులకు వల వేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. లాంటి నకిలీ ఫోన్లు, నకిలీ అధికారుల మాటలను ఖాతరు చేయవద్దని స్పష్టం చేశారు. కార్మిక శాఖ కార్యాలయానికి సంబంధించి ఎలాంటి లావాదేవీలు ఉన్నా తమ సిబ్బంది నేరుగా మాట్లాడతారని, ఏమైనా సందేహాలుంటే అమలాపురంలోని కార్మిక శాఖ కార్యాలయానికి వచ్చి సంప్రదించాలని మహేష్ విజ్ఞప్తి చేశారు.

ఎంపీ అనురాధ పరామర్శ



గుర్రం విజయలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ అనురాధ

అల్లవరం: ఇటీవల కొమరగిరిపట్నంలో మృతి చెందిన గుర్రం విజయలక్ష్మి కుటుంబ సభ్యుల్ని ఎంపీ అనురాధ బుధవారం పరామర్శించారు. విజయలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించి ఆమె కుమారుడు, సీనియర్ పాత్రికేయుడు గుర్రం బాబ్జిని కలిసి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గూడాలలో గుండెపోటుతో మృతి చెందిన ఎంపీటీసీ జల్లి మరియమ్మ కుటుంబసభ్యులను ఎంపీ పరామర్శించారు. ఎంపీ అనురాధ వెంట వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్ సాధనాల సూర్య వెంకటనాగమణి, సొసైటీ చైర్మన్ గుర్రం బాబులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కడలి లక్ష్మణరావు తదితరులున్నారు.

బీజేపీ నేతలపై ఎస్పీకి ఫిర్యాదు

అమలాపురం టౌన్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను హత్య చేస్తానని కర్ణాటక రాష్ట్రంలోని బీజేపీ అభ్యర్థి మణికంఠ రాథోడ్ సెల్‌ఫోన్‌లో మాట్లాడిన మాటలపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్‌కు జిల్లా కాంగ్రెస్ నాయకుల బృందం ఫిర్యాదు చేసింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు అయితాబత్తుల సుభాషిణి, డాక్టర్ దేవరపల్లి రాజేంద్రబాబు, యార్లగడ్డ రవీంద్ర తదితరులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ బడులకు భద్రత

- జెడ్పీ హైస్కూళ్లలో నైట్ వాచ్‌మెన్‌ల ఏర్పాటు
- పాఠశాలల ఆస్తుల పరిరక్షణకు చర్యలు



ముమ్మిడివరం మండలం కొత్తలంక జెడ్పీ ఉన్నత పాఠశాల

ముమ్మిడివరం: పాఠశాలల్లో కంప్యూటర్ల చోరీకి గురికావడం, రాత్రి వేళల్లో స్కూళ్లలో కొంతమంది ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం, స్కూలు రికార్డులు మాయం చేయడం వంటి సంఘటనలు కోకొల్లలు. సాయంత్రం పాఠశాలలు మూసివేసి ఉపాధ్యాయులు, సిబ్బంది ఇంటికి వెళ్లిపోయిన తరువాత ఎవరి పర్యవేక్షణ లేకపోవడం వల్లే అలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇలాంటివి పునరావృతం కాకూడదని ప్రభుత్వం హైస్కూళ్లలో నైట్ వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేసేందుకు పూనుకుంది.

టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైపోయిన విద్యావ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. పాడుబడిన పాఠశాలలను నాడు–నేడు పథకం ద్వారా కార్పొరేట్ స్థాయిలో ఆధునీకీకరించడంతో పాటు సకల సౌకర్యాలను ఏర్పాటు చేస్తుంది. హైస్కూళ్లలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలు, కంప్యూటర్ పరికరాలు, ఇతర సామగ్రి కాపాడేందుకు ప్రభుత్వం నైట్ వాచ్‌మెన్‌లను నియమించేందుకు నిర్ణయం తీసుకోవడంతో ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జెడ్పీ హైస్కూళ్లలో ఏళ్ల తరబడి నైట్ వాచ్‌మెన్‌లు లేకపోవడంతో చాలాసార్లు చోరీలు జరిగాయి. కంప్యూటర్ల చోరీలైతే లెక్కేలేదు. మందుబాబులు, జూదరులు హైస్కూల్ ప్రాంగణాలను అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మార్చేస్తున్నారు. అంతేకాకుండా పాఠశాల ఆవరణలో పశువులు చొరబడి నీడనిచ్చే మొక్కలను ధ్వంసం చేస్తున్నాయి. వీటన్నింటిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి మౌనంగా భరిస్తూ వస్తున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయం వారికి ఊరటనిస్తుంది.

స్థానికులకే ప్రాధాన్యం

నెలకు రూ.6 వేలు గౌరవ వేతనంతో నియమించే నైట్ వాచ్‌మెన్ పోస్టులకు సంబంధించి అదే హైస్కూల్‌లో పనిచేసే మహిళ భర్తకు ప్రాధాన్యం ఇవ్వాలని, 60 ఏళ్ల లోపు వయసున్న ఎక్స్ సర్వీస్ మెన్ లేదా పేరెంట్స్ కమిటీ ఎంపిక చేసే వ్యక్తిని నియమించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ షరతుల ప్రకారం ఎంఈఓ, హెచ్ఎంలు సమన్వయంతో నమ్మకంగా పనిచేసే వాచ్‌మెన్‌లను నియమించుకున్నారు.

హైస్కూళ్లకు రక్షణ



హైస్కూళ్లకు నైట్ వాచ్‌మెన్‌లను నియమించాలన్న ప్రభుత్వ నిర్ణయం ఎంతో అభినందనీయం. గతంలో చాలాసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నైట్ వాచ్‌మెన్‌ల నియామకంపై జీఓ జారీ చేయడంతో హైస్కూళ్ల ఆస్తులకు రక్షణ ఏర్పడింది. అన్ని హైస్కూళ్లకు వాచ్‌మెన్‌లను నియమించాం.

– బొజ్జా రమణశ్రీ, ఎంఈఓ, ముమ్మిడివరం

సభా స్థలం పరిశీలించిన ఎమ్మెల్యే



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

కాట్రేనికోన: కాట్రేనికోన మండలంలో ఈ నెల 16న జరిగే మత్స్యకార భరోసా పంపిణీ సమావేశ స్థలాన్ని అమలాపురం ఆర్డీఓ వసంత రాయుడుతో కలిసి ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ బుధవారం పరిశీలించారు. మత్స్యకార భరోసా లబ్ధిదారులు ప్రతిఒక్కరూ సమావేశానికి రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, నల్లా నరసింహమూర్తి, పాలెపు ధర్మారావు, జగడం బాలయ్య, ఏపీఎం వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ కామేశ్వరరావు తదితరులున్నారు.

సంక్షేమ పథకాలతో నిరుపేదలకు ఆర్థిక భరోసా



తుమ్మలపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్న పినిపే శ్రీకాంత్ తదితరులు

అల్లవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అందిస్తున్న సంక్షేమ పథకాలతో నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా ఏర్పడుతుందని మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పినిపే శ్రీకాంత్ అన్నారు. తుమ్మలపల్లి సచివాలయం పరిధిలో ఆయన బుధవారం రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అందుతున్న లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు పారదర్శక అమలు, అభివృద్ధికి మంత్రి విశ్వరూప్ కృషి చేస్తున్నారని చెప్పారు. నాలుగేళ్ల కాలంలో 95 శాతం హామీలు అమలు చేసిన ఘనత మన ప్రభుత్వానిదన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగించాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, ఎంపీటీసీలు పులుసుగంటి రాజేశ్వరి, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు పల్లి జేమ్స్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కాట్రు శాంతికిరణ్, సొసైటీ డైరెక్టర్ పులుసుగంటి గంగాధర్, తహసీల్దార్ సాంబశివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీవీ రావు చిరస్మరణీయుడు



పీవీ రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత ఐక్య వేదిక ప్రతినిధులు



పీవీ రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అమలాపురం టౌన్: మాల మహానాడును నెలకొల్పి ఎన్నో ఉద్యమాలకు ఊపిరులూదిన పీవీ రావు చిరస్మరణీయుడని జిల్లా దళిత ఐక్యవేదిక చైర్మన్ డీబీ లోక్ అన్నారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులో పీవీ రావు జయంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వేదిక జిల్లా ప్రతినిధులు పీవీ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ జంగా బాబూరావు, నాగారపు వెంకటేశ్వరరావు, మెండు రమేష్‌బాబు, పెనుమాల చిట్టిబాబు, రమణ పాల్గొన్నారు.

ఘనంగా పీవీరావు జయంతి వేడుకలు

ముమ్మిడివరం: మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు జయంతి వేడుకలను మండలంలోని అనాతవరం పీవీరావు ఘాట్ వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. పీవీ రావు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మిమ్మిర్తి చిరంజీవి, మాజీ జెడ్పీటీసీ మానేపల్లి సత్యనారాయణ, పెయ్యల పరశురాముడు, రజని, జల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామంలో మాల మహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు జయంతి వేడుకలను మండల కన్వీనర్ కొంకి వెంకట బాబ్జి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు.

అల్లవరం: మలమహానాడు వ్యవస్థాపకుడు పీవీ రావు జయంతి వేడుకలను దేవగుప్తంలోని ఆయన నివాసంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పీవీ రావు చిత్రపటానికి ఆయన సోదరులు మాజీ సర్పంచ్ పోతుల నాగరాజు, విశ్రాంతి ఐఏఎస్ అధికారి పీఎస్ఎన్ మూర్తి, మాలమహానాడు రాష్ట్ర నాయకులు పెయ్యల పరశురాముడు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దాసరి సత్తిబాబు, సర్పంచ్ సాధనాల వెంకటరావు, ఎంపీటీసీలు ముత్తాబత్తుల రాంబాబు, మాకే కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం



విద్యార్థినులను సత్కరిస్తున్న ఎంపీపీ రాయుడు సునీత తదితరులు

తాళ్లరేవు: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండల స్థాయిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను మండల ప్రజాపరిషత్ పాలకవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. బుధవారం స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశపు హాలులో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ఇంజరం హైస్కూల్ విద్యార్థినులు కె.మాధురి(580 మార్కులు), కె.హేమలత (579 మార్కులు), మండల స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిన నీలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇంధన వెంకట దివ్య సంతోషిని(573 మార్కులు)లను ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ తదితరులు సత్కరించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.అనుపమ, తహసీల్దార్ ఎస్.పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు అధిక నిధులు

మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ రాయుడు సునీత



తాళ్లరేవు మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాయుడు సునీత

తాళ్లరేవు: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక నిధులు కేటాయిస్తున్నట్లు ఎంపీపీ రాయుడు సునీత తెలిపారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశపు హాలులో ఆమె అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత మాట్లాడుతూ మండల పరిధిలోని కోరంగి శివారు చినబొడ్డు వెంకటాయపాలెంలో రూ.15 లక్షలు, పటవల పంచాయతీలో రూ.10 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులు తాగునీటి పైపులైన్‌లకు కేటాయించామన్నారు. పి.మల్లవరంలో రూ.5 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణం, చొల్లంగిపేటలో రూ.4 లక్షలతో డ్రైనేజీలు నిర్మాణానికి నిధులు కేటాయించామని చెప్పారు. ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ద్వారా అనేక పథకాలను అమలు చేస్తుందని, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతుల్ని ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ మాట్లాడుతూ దీర్ఘకాలిక ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభించారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇరిగేషన్ అధికారుల తీరు హాస్యాస్పదం

మండలంలో ఇరిగేషన్ అధికారుల తీరు హాస్యాస్పదంగా ఉందని వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్ విమర్శించారు. రబీలో వరిపంటకు పూర్తిస్థాయిలో సాగునీటిని సరఫరా చేయలేకపోయారని, ఇరిగేషన్ కాలువలకు ఆధునీకీకరణ పనులు ఇప్పటివరకూ చేపట్టలేదన్నారు. కాలువల ఆధునీకీకరణ పనులకు పనులకు సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామని ఇరిగేషన్ గుమాస్తా సమాధానమిచ్చారు. ఆర్టీసీ బస్సులు సమయానికి రాకపోవడం వల్ల విద్యార్థులు, ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆర్టీసీ అధికారులు నియమిత వేళల్లో బస్సులు నడపాలని కోరంగి ఎంపీటీసీ సభ్యురాలు పోతుల రత్నకుమారి కోరారు. సమావేశంలో ఎంపీడీఓ ఎం.అనుపమ, తహసీల్దార్ ఎస్.పోతురాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై మల్లాడి సమావేశం



విద్యుత్ శాఖ ఈఈ సింథిల్‌కుమార్‌తో సమావేశమైన మాజీమంత్రి మల్లాడి కృష్ణారావు

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో విద్యుత్ సమస్యలపై విద్యుత్‌శాఖ ఈఈ సింథిల్‌కుమార్‌తో స్థానిక కార్యాలయంలో ఢిల్లీలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి, మాజీమంత్రి మల్లాడి కృష్ణారావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీరగ్రామాల్లో లోఓల్టేజీ రాకుండా రూ.6 కోట్లతో ప్రత్యేక విద్యుత్‌లైన్‌ను అభివృద్ధి చేయాలని, కురసాంపేట, సావిత్రినగర్‌కు రూ.54 కోట్లతో అండర్ గ్రౌండ్ కేబుల్ ఏర్పాటు చేయాలని కోరారు. ఫ్రాన్సుతిప్ప, గణపతినగర్ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాల కొరత లేకుండా చేయాలన్నారు. డంపింగ్ యార్డు విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంతంలో ఏర్పాటుపై అభ్యంతరం తెలుపుతున్నట్లు తెలిపారు. డంపింగ్ యార్డు నేషనల్ హైవేకు 200 మీటర్ల దూరంలో ఉండాలని నిబంధనలు ఉన్నాయన్నారు.

ఇళ్ల స్థలాల సమస్యలు పరిష్కరించాలి

తాళ్లరేవు: మండల పరిధిలోని అసైన్డ్ భూములు, ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను గురువారం కలిసి సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. కోరంగి గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 276/1 నుంచి 276/31 వరకు గల సుమారు 60 ఎకరాల అసైన్డ్ భూమిని లబ్ధిదారులకు ఇప్పించి పట్టాలు ఇవ్వవలసిందిగా కోరారు. అలాగే కొత్త కోరంగి గ్రామంలో సర్వే నెంబరు 402లో గ్రామ కంఠం భూమి పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో టేకుమూడి ఈశ్వరరావు, దుప్పి అదృష్టదీపుడు, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

జేవీకే కిట్‌ను పరిశీలించిన అధికారులు



నగరం జెడ్పీ హైస్కూల్‌లో నోట్ పుస్తకాలు పరిశీలిస్తున్న అధికారులు

మామిడికుదురు: జగనన్న విద్యా కానుక (జేవీకే) స్టాక్ పాయింట్లను సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు బుధవారం పరిశీలించారు. నగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌ను ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఏపీఓ డాక్టర్ ఎంఏకే భీమారావు, ఏఎంఓ పి.రాంబాబులు తనిఖీ చేశారు. స్టాక్ పాయింట్‌లో వచ్చిన షూస్, నోట్ బుక్స్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న విద్యా కానుక కిట్లలో సరఫరా అవుతున్న యూనిఫామ్, షూస్, నోట్ బుక్స్, బెల్ట్, బ్యాగ్స్ తదితర వస్తువులు పూర్తి నాణ్యతతో ఉండే విధంగా చూడాలన్నారు. అలాగే నోట్ పుస్తకాలు కూడా దిగుమతి చేసుకొని సమయంలో ఇండెంట్ ప్రకారం వస్తున్నవి లేనిది పరిశీలించుకుని తేడా వస్తే పై అధికారులకు తెలియజేయాలన్నారు. పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను పరిశీలించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన డీఎల్పీఓ బొజ్జిరాజు



మంత్రి విశ్వరూప్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎల్పీఓ బొజ్జిరాజు

అమలాపురం రూరల్: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి విశ్వరూప్‌ను అమలాపురం డివిజనల్ పంచాయతీ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పెట్టా బొజ్జిరాజు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డీఎల్పీఓతో పాటు కోనసీమజిల్లా కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్రరాజు సూరపరాజు, రామకృష్ణ, ఎ.రాజా తదితరులు మంత్రిని కలిసినవారిలో ఉన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ ధ్యానచంద్ర, డీపీఓ మధుసూదన్‌లను డీఎల్పీఓ బొజ్జిరాజు కలిశారు.

సామాజిక చైతన్యయాత్రను విజయవంతం చేయాలి



నాగుల్లంకలో మాట్లాడుతున్న సత్యనారాయణ

పి.గన్నవరం: మాదిగల సామాజిక చైతన్య యాత్ర ఈ నెల 13న చాకలిపాలెం సెంటర్‌కు చేరుకుంటుందని మాదిక సోదరులంతా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి ముస్కుడి సత్యనారాయణ అన్నారు. నాగుల్లంక శివారు ఉంద్రాజవరపువారిపేటలో ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం బుధవారం జరిగింది. సత్యనారాయణ మాట్లాడుతూ జాతీయ అధ్యక్షులు తెన్నేటి కిషోర్ మాదిగ చేస్తున్న మాదిగల సామాజిక చైతన్య యాత్ర చాకలిపాలెం సెంటర్ వద్దకు సాయంత్రం 4 గంటలకు చేరుకుంటుందన్నారు. మాదిగలు ఆర్థికంగా, సామాజికంగా విద్యా ఉద్యోగ రంగాలలో అభివృద్ధి కొరకు ఎనలేని కష్టపడుతున్నారని అందుకు కిషోర్‌కి యావత్ జాతి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వేలాది మంది మాదిగలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉంద్రాజవరపు సురేష్‌బాబు, యార్లగడ్డ విజయ్‌కుమార్, యు.రాజేష్, యు.శేఖర్, బి.శ్యామ్, కే.శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు

స్వామికి సింహాసనం సమర్పణ

మామిడికుదురు: అప్పనపల్లిలో వేంచేసిఉన్న బాల బాలాజీ స్వామివారి సన్నిధిలో ఉత్సవమూర్తులను ఉంచుటకు టేకు సింహాసనాన్ని బుధవారం భక్తుల సమర్పించారు. బోడసుకుర్రుకు చెందిన చింత నాగేశ్వరరావు–మంగాదేవి దంపతుల కుమారుడు చింతా బాబి, పార్వతితో పాటు వారి కుటుంబ సభ్యులు సుమారు రూ.50 వేలు విలువైన టేకు సింహాసనం స్వామికి సమర్పించారు. వీరికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ సీహెచ్ రామకృష్ణ, ధర్మకర్తల మండలి సభ్యులు గుత్తుల భానుప్రకాష్, గూటం శ్రీనివాస్, పెదమల్లు ఉషారాణి, బత్తుల విజయ గంగారత్నం, బొరుసు పార్వతీ దుర్గాభవాని, ఆలయ ఉప ప్రధాన అర్చకులు మద్దాలి తిరుమల శింగరాచార్యులు వారికి ప్రసాదాలు ఇచ్చి సత్కరించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మరియు ఈవో డి.రామవరప్రసాద్ పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న కుండలు



కమ్మిరెడ్డిపాలెంలో విక్రయానికి ఉంచిన కుండలు



కొత్తపేట చలివేంద్రంలో ఏర్పాటుచేసిన కూలింగ్ వాటర్ ప్లాస్టిక్ టిన్నులు

కొత్తపేట: వేసవి కాలంలో పలు వ్యాపార సంస్థలు, షాపులు వద్ద మంచినీటి కుండలు కనిపించేవి. ఇప్పుడు అవి కనుమరుగయ్యాయి. వాటి స్థానంలో కూలింగ్ వాటర్‌తో కూడిన ప్లాస్టిక్ టిన్నులు కనిపిస్తున్నాయి. వేసవి వచ్చిందంటే ప్రజలు, ప్రయాణికులు, మార్కెట్‌కు వచ్చే క్రయ, విక్రయదారుల దాహార్తి తీర్చేందుకు పలు సేవాసంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేసేవి. ఆ శిబిరంలో చెక్కతొట్టెల్లో ఇసుకపోసి దానిపై మట్టి కుండలు పెట్టి వాటిలో నీరు, మజ్జిగ పోసేవారు. తరచూ ఇసుక తడుపుతూ కుండలకు గుడ్డలు చుట్టి తడిపేవారు. అలాగే పలు వ్యాపార సంస్థల వద్ద కూడా ఇలాగే మట్టి కుండలు ఏర్పాటు చేసి దాహార్తి తీర్చేవారు. ఆ కుండల్లో మంచినీరు లేదా మజ్జిగ ఏ విధమైన కాలుష్యం లేకుండా చల్లగా ఉండేవి. అయితే వాటి స్థానంలో ప్లాస్టిక్ టిన్నులు కనిపిస్తున్నాయి. భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయనే ప్రచారంతో మంచి నీరు విక్రయ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. సురక్షిత నీరు, మినరల్ వాటర్ పేరుతో మంచినీరు విక్రయిస్తున్నారు. అంతే కాకుండా కూలింగ్ టిన్నులు (ప్లాస్టిక్ ప్లాస్కులు) వాడుకలోకి వచ్చాయి. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఆ వాటర్‌నే ఏర్పాటు చేస్తున్నారు. ఆ నీరును ఆయా కేంద్రాల వద్దే కాకుండా డోర్‌డెలివరీ సప్లై చేస్తున్నారు. ఈ విధంగా మట్టి కుండలు కనుమరుగవగా ప్లాస్టిక్ కూలింగ్ వాటర్ టిన్నులు ప్రత్యక్షమయ్యాయి.

కుండల విక్రయం తగ్గిపోయింది



ప్రస్తుతం కూలింగ్ వాటర్ టిన్నులు రావడంతో మట్టి కుండల వాడకం తద్వారా విక్రయాలు తగ్గిపోయాయి. గతంలో ప్రతీ వేసవి సీజన్‌లో ఇళ్లల్లో, షాపుల్లో, చలివేంద్రాల్లో మంచి నీరు పోసుకునేందుకు కుండలు అమ్మేవాళ్లం. కాలక్రమేణా కుండల వాడకం తగ్గిపోయింది. కొన్నైనా అమ్ముదామని తయారు చేసినా ఎవరూ కొనక అలాగే మిగిలిపోతున్నాయి.

– మంతెన సుబ్రహ్మణ్యం, కుండలు విక్రయదారుడు, కొత్తపేట